
నమస్తే తెలంగాణ
# మెదక్
I | హైదరాబాద్, సోమవారం 9 డిసెంబర్ 2024 | MEDAK



గులాబీ అధినేత కేసీఆర్‌తో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి

## గులాబీ అధినేత కేసీఆర్‌ను కలిసిన నేతలు




బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

## పేరు సరిచేసుకున్నా రుణమాఫీ కాలేదు..

ఝరాసంగం, డిసెంబర్ 8 : ఝరాసంగం కెనరా బ్యాంక్ నుంచి రూ.1.50 లక్షల పంట రుణం తీసుకుని రెగ్యులర్‌గా రెన్యువల్ చేస్తున్నాను. ఆధార్ కార్డులో వైద్య శివకాంత్‌రావుగా పేరు ఉంది, బ్యాంకు ఖాతాలో శివకాంత్‌రావుగా ఉండటంతో రుణమాఫీ జరగలేదని, పేర్లు సరిచేసుకుని పేపర్లు ఇవ్వాలని వ్యవసాయాధికారులు సూచించారు. అన్నింటిలో వైద్య శివకాంత్‌రావుగా సరిచేసి పేపర్లు వ్యవసాయాధికారులకు ఇచ్చిన.అయినా నాకు పంట రుణమాఫీ వర్తించలేదు. గిట్ల ఎందుకు అయితుందో నాకైతే ఏమీ సమజైతలేదు. ప్రభుత్వం నాకు న్యాయం చేయాలి.

–వైద్య శివకాంత్‌రావు, రైతు, ఝరాసంగం,సంగారెడ్డి జిల్లా



గతంలో వ్యవసాయాధికారుల వద్ద ఇలా


# ఏడాది పాలన అంతంతే..!

- రేవంత్ పాలనపై పెదవి విరుస్తున్న సబ్బండ వర్గాలు
- ఏం సాధించారని విజయోత్సవాలు అంటూ ప్రశ్నలు
- పంట రుణమాఫీ కాలేదని.. రైతు భరోసా రాలేదని ఆవేదన
- ఆరు గ్యారెంటీల అమలు ఏమైందని ప్రశ్నల వర్షం
- ఇప్పటికే పలు గ్రామాల్లో కళాబృందాల అడ్డగింత
- ఉమ్మడి మెదక్ జిల్లాకు ఏడాదిలో తీరని అన్యాయం
- పనులు రద్దు.. నిధులు వాపస్.. పలు పనులు ఇతర జిల్లాలకు మళ్లించిన సీఎం రేవంత్
- ఏడాది పాలనపై సొంత పార్టీ నేతలే పెదవి విరుపు
- విజయోత్సవాలకు దూరంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు

సిద్దిపేట, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఏడాది కిందట అలవి కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారుపై భ్రమలు వీడాయి.ఈ ఏడాది పాలనలో ఏ ఒక్క హామీని సరిగ్గా అమలు చేయలేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఆరు గ్యారెంటీలతో ఊదరగొట్టిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం లేదని, ఏం చేశారని విజయోత్సవాలు నిర్వహిస్తున్నారంటూ ప్రజలు ప్రభుత్వతీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా మంత్రులు కూడా విజయోత్సవాలపై సీరియస్‌గా దృష్టిపెట్టడం లేదు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు,నాయకులు విజయోత్సవాలకు దూరంగా ఉంటున్నారు. గ్రామాలకు పోతే హామీలపై ఎక్కడ ప్రజలు నిలదీస్తారో అన్న భయం వారిని పట్టుకున్నది. ఇప్పటికే ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు గ్రామాల్లో సాంస్కృతిక కళాబృందాలను ప్రజలు నిలదీశారు. రూ.2 లక్షల పైన ఉన్న రైతుల పంట రుణమాఫీ ఏమైంది..? రేషన్‌కార్డులు ఏవి..? ఆడబిడ్డలకు ఇస్తామన్న రూ 2,500 ఏవి..? కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఏమైంది..? రైతుభరోసా ఏది..? అంటూ అన్నివర్గాల ప్రజలు రేవంత్ సర్కార్‌ను నిలదీస్తున్నారు.

**కాంగ్రెస్ పాలనలో మెతుకు సీమకు తీరని అన్యాయం...**

కాంగ్రెస్ సర్కారు ఈ ఏడాది కాలంలో పాత మెదక్ జిల్లాపై శీతకన్ను వేసింది. ఏడాదిగా జిల్లాకు నిధులు కేటాయించలేదు. కొత్తగా పైసా అభివృద్ధి పని జరగడం లేదు. గ్రామ పంచాయతీలకు నిధులు లేవు, ఎమ్మెల్యేల కోటా కింద వచ్చే నిధులు ఆపేశారు. జిల్లాకు వచ్చే ప్రత్యేక నిధులు ఇవ్వలేదు. జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు లేవు. ఏడాదిగా నిధులు లేక పోవడంతో జిల్లాలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. మెదక్‌లో మెడికల్ కళాశాలను 100 సీట్ల నుంచి 50కి కుదించి రేవంత్ సర్కారు అన్యాయం చేసింది. సిద్దిపేట నుంచి వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు సీఎం రేవంత్ తరలించుకుపోయాయి. జిల్లాలో వందల కోట్ల రూపాయల నిధులు రద్దుచేసిండు. అనేక అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ప్రభుత్వం ఆపేసింది. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అనేక పనులు రద్దు చేసి కక్ష పూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. రోడ్ల పనులు ఆగిపోయాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో అనేక మంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో రైతులు వాపోతున్నారు. రైతుభరోసా రాక రైతులు మళ్లీ అప్పులు చేసి పంటలు సాగుచేస్తున్నారు. ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు నింపుతామని రేవంత్ సర్కారు గొప్పలు చెప్పి తమను మోసం చేసిందని యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నది. నిరుద్యోగ భృతి, యువతకు వడ్డీలేని రుణాలు ఇస్తామనే హామీ బుట్టదాఖలు కావడంతో నిరాశలో ఉన్నారు. ఉద్యోగులకు, నిరుద్యోగులకు, పెన్షనర్లకు, ఆటో డ్రైవర్‌లకు, వ్యవసాయ కూలీలకు, మహిళలకు, రైతులకు ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందని ఆయా వర్గాలు వాపోతున్నాయి.



సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో కళాజాత బృందం కళాకారులతో వాగ్వాదానికి దిగిన రైతులు (ఫైల్)

**బీఆర్‌ఎస్ హయాంలో నిధుల వరద...**

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు నిధుల వరద పారింది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో అభివృద్ధి పరుగులు పెట్టింది. కేసీఆర్, హరీశ్‌రావు పాలనలో మెదక్ జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పదేండ్లలోనే ఎంతో అభివృద్ధి జరిగి ఆదర్శంగా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధులు విడుదల కాక అభివృద్ధి కుంటుపడింది. గతంలో మంజూరు చేసిన నిధులను సైతం రద్దు చేసి ఉమ్మడి జిల్లాపై కాంగ్రెస్ సర్కార్ కక్ష కట్టింది. నేటితో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది పూర్తి అవుతుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిత్యం ప్రజాప్రతినిధులు ప్రజల మధ్యన ఉండి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. హామీలను నెర వేర్చకపోవడంతో ఏడాదిలోనే ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది.

రేవంత్ సర్కార్ ఏడాది పూర్తవుతున్న సందర్భంగా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు.డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహిస్తున్నది. చేసింది ఏం లేక...చెప్పడానికి ఏం లేదు.. ఇక విజయోత్సవాలు ఏంటి అని అధికార పార్టీ నేతలే గుసగుసలాడుతున్నారు.ఇక ప్రజల మధ్యకు పోయి ఏం విజయోత్సవాలు చేస్తామంటూ ముఖం చాటేస్తున్నారు. మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్ వారి సొంత నియోజకవర్గాలకే పరిమితమయ్యారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా అంతే..వారు కూడా పాల్గొన్నది లేదు. ఐదారు రోజులుగా జరిగిన కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ క్యాడర్ దూరంగానే ఉంది.ఏదో చేశాము అన్నట్లుగా అధికారులు తూతూమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారు.

## ప్రాణాలు మింగిన ప్రయాణం

- గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు కానిస్టేబుళ్ల దుర్మరణం
- ఈసీఐఎల్‌లో మారథాన్‌కు వెళ్తుండగా ఘటన
- సిద్దిపేట జిల్లా గజ్వేల్ సమీపంలోని జాలిగామ బైపాస్‌లో ప్రమాదం
- ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం



మృతులు వెంకటేశ్, పరంధాములు(ఫైల్)

గజ్వేల్, డిసెంబర్ 8: సిద్దిపేట జిల్లాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కానిస్టేబుళ్లు మృతిచెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ బైపాస్‌లో ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. గజ్వేల్ సీఐ సైదా వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం గాడిచెర్లపల్లికి చెందిన పూసల వెంకటేశ్(38) దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నకోడూర్ మండలం పెద్దకోడూరుకు చెందిన వర్దోలు పరంధాములు(46)రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి వెంకటేశ్ దౌల్తాబాద్‌లో, పరంధాములు రాయపోల్‌లో విధులు నిర్వర్తించారు. అనంతరం ఇద్దరు కలిసి హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌లో నిర్వహించే హాఫ్ మారథాన్‌లో పాల్గొనేందుకు ఏపీ 15బీఎన్ 9215 బైక్‌పై ఆదివారం వేకువజామున బయలుదేరారు. గజ్వేల్ సమీపంలోని జాలిగామ బైపాస్ రోడ్డులో వీరి బైక్‌ను గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సీఐ సైదా సిబ్బందితో కలిసి సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను గజ్వేల్ మార్చురీకి తరలించారు. సిద్దిపేట సీపీ అనురాధ, అడిషినల్ డీసీపీ మల్లారెడ్డి, గజ్వేల్ ఇన్‌చార్జి ఏసీపీ మధు, ఇన్‌స్పెక్టర్ సైదా, దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. పూజల వెంకటేశ్ 2007లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి జిల్లాలోని సిద్దిపేట, మిరుదొడ్డి, సిద్దిపేట ట్రాఫిక్, పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహించాడు. ప్రస్తుతం దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మృతిచెందాడు. ఇతనికి భార్య ఉషాల శ్యామల, ఇద్దరు కూతుళ్లు వెన్నెల, హన్సిక ఉన్నారు. వర్దోలు పరంధాములు 2004లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరాడు. మొదట కొల్చారంలో విధులు నిర్వహించాడు. అనంతరం సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక ఠాణాలో, సిద్దిపేట కమిషనరేట్‌లోని సీసీ కెమెరా విభాగం, ప్రస్తుతం రాయపోల్‌లో పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య కళ్యాణి, కూతురు నక్షత్ర, కుమారుడు మణితేజ ఉన్నారు. ఈ ఏడాది జూలై 4న రాయపోల్‌కు బదిలీపై వచ్చాడు.

**మృత్యువులోనూ వీడని స్నేహం...**

పోలీస్ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో కష్టపడి ఉద్యోగం సాధించిన పూజల వెంకటేశ్, వర్దోలు పరంధాములు చిన్న వయస్సులోనే రోడ్డు ప్రమాదంలో మరణించడం వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. ఉద్యోగం చేస్తున్న క్రమంలో ఇద్దరి మధ్య స్నేహం విడదీయలేని బంధంగా మారింది. సిద్దిపేటలో 2022లో పోలీస్ శాఖ నిర్వహించిన హాఫ్ మారథాన్ ఇద్దరిలో మంచి స్ఫూర్తిని నింపింది. సిద్దిపేట మారథాన్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న వీరు యువతలో ప్రేరణ నింపాలనే ఉద్దేశంతో దేశంలోని హైదరాబాద్, ముంబయిలో నిర్వహించిన 42 మారథాన్, ఢిల్లీలో 25 మారథాన్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన 15కు పైగా హాఫ్ మారథాన్‌లలో పాల్గొన్నారు. సిద్దిపేటలో ఎంతో మంది పోలీస్ కానిస్టేబుళ్లు, యువతకు స్ఫూర్తిగా నిలిచారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో నిర్వహించిన మారథాన్‌లకు ఇద్దరు కలిసి వెళ్లేవారు. మారథాన్‌లో అనేక సందర్భాల్లో పాల్గొన్న వీరిని పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.



సంఘటనా స్థలంలో మృతదేహాలు

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన హరీశ్‌రావు**

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు వెంకటేశ్, పరంధాములు మృతిచెందడంపై మాజీ మంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీస్ ఉద్యోగంలో నిబద్ధత కలిగిన ఈ ఇద్దరు యువ కానిస్టేబుళ్ల మృతి చెందడం బాధాకరమని, పోలీస్ ఉద్యోగులుగా కాకుండా సామాజిక సేవకులుగా వీరు పనిచేసి ఎంతో స్ఫూర్తి నింపారని కొనియాడారు. సిద్దిపేటలో జరిగిన హాఫ్ మారథాన్‌లో పాల్గొని యువతలో చైతన్యం తెచ్చారని, ఉచిత కానిస్టేబుల్ కోచింగ్, ఇతర సామాజిక సేవల్లో వారు అందించిన సేవలను కొనియాడారు. వారి కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇద్దరు కానిస్టేబుళ్లు వెంకటేశ్, పరంధాములు మృతి చాలా బాధాకరమని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ పేర్కొన్నారు. గజ్వేల్ దవాఖానలోని మార్చురీలో మృతదేహాలకు ఆమె సంతాపం తెలిపారు. పోలీస్ శాఖ తరఫున అన్నివిధాలుగా అండగా ఉంటామని, వారికి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ త్వరగా కుటుంబాలకు అందేలా చూస్తామన్నారు. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, గజ్వేల్ ఇన్‌చార్జి ఏసీపీ మధు, పోలీస్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పుష్పగుచ్ఛం వేసి నివాళులర్పించారు. ఇన్‌స్పెక్టర్లు సైదా, మహేందర్, విద్యాసాగర్, ఎస్సైలు, మృతుల బ్యాచ్‌మేట్స్, ప్రజాప్రతినిధులు మృతదేహంపై పుష్పగుచ్ఛాలు వేసి నివాళులర్పించారు.



గజ్వేల్ మార్చురీలో మృతదేహాలను పరిశీలిస్తున్న సిద్దిపేట సీపీ అనురాధ

## ప్రజారోగ్యంపై పట్టింపేదీ..?

- ఆరోగ్యాన్ని పంచే ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు మరిచిన ప్రభుత్వం
- హుస్నాబాద్‌లో బీఆర్‌ఎస్ సర్కారు ఏర్పాటు చేసిన ఒక్క ఓపెన్ జిమ్ దిక్కు
- మంత్రి దృష్టిసారించాలని పట్టణవాసుల వినతి



హుస్నాబాద్ ఎల్లమ్మచెరువు ప్రాంతంలోని ఓపెన్ జిమ్

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 8:ఉరుకులు పరుగుల యాంత్రిక జీవనశైలిలో మనిషి ఆరోగ్యం దెబ్బతింటున్నది. ఈ నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మచెరువు ప్రాంతంలో రూ.24లక్షలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓపెన్ జిమ్ అందుబాటులోకి తేవడంతో ప్రజలకు ఉపయోగపడుతున్నది. ఓపెన్ జిమ్‌కు వచ్చి వ్యాయామం చేసే పట్టణ వాసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. దీంతో వ్యాయామానికి నిరీక్షణ తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మరిన్ని ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందిగా మారింది. మనిషి మనుగడకు ఆరోగ్యం ప్రధానమైనది. ఆరోగ్యాన్ని పంచేందుకు జిమ్‌లు ఎంతగానో తోడ్పడుతాయి. శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించడంతో పాటు ధృడంగా ఉంచేందుకు వ్యాయామం దోహదం చేస్తుంది. ఈ నేపథ్యంలో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా హుస్నాబాద్ పట్టణానికి నలువైపులా ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఎల్లమ్మచెరువు సమీపంలో మాత్రమే ఓపెన్ జిమ్‌ను నిర్వహిస్తున్నారు. వ్యాయామానికి వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో అవకాశం కొరకు గంటల తరబడి వేచిచూడాల్సి వస్తున్నది. ఈ పరిస్థితుల్లో పట్టణానికి నలువైపులా మరిన్ని ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరుతున్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టిసారించి మరిన్ని ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఆర్సీపురంలో భారీ చోరీ

**46తులాల బంగారం, 20తులాల వెండి, రూ.13వేల నగదు అపహరణ**



ఆర్సీపురంలో ఇంట్లోని బట్టలపై కారం చల్లిన దుండగుడు

రామచంద్రాపురం, డిసెంబర్ 8: ఆర్సీపురం డివిజన్‌లోని సాయినగర్‌కాలనీలో ఆదివారం భారీ చోరీ జరిగింది. శనివారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లోని వారు గాఢ నిద్రలో ఉండగా దుండగుడు మరో బెడ్‌రూంలోకి వెళ్లి దొంగతనానికి పాల్పడ్డాడు. సాయినగర్‌కాలనీకి చెందిన వేణుగోపాల్ ప్రైవేట్ ఉద్యోగి. శనివారం రాత్రి పడుకునే ముందు ఇంటి మెయిన్ డోర్ మధ్యలోని గడియపెట్టి సెంట్రల్ లాక్ వేయడం మర్చిపోయి బెడ్‌రూంలోకి వెళ్లి పడుకున్నాడు. అర్ధరాత్రి దుండగుడు ఇంట్లోకి వెళ్లి కిటికీ నుంచి మెయిన్ డోర్ తెరిచి లోనికి ప్రవేశించాడు. వేణుగోపాల్ కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న గదిలోకి కాకుండా అతని తల్లిదండ్రులు ఉండే మరో బెడ్‌రూంలో ఎవరూ లేని విషయాన్ని గమనించి వస్తువులన్నీ తీసి చిందరవందరగా పడేశాడు. ఆ గదిలో దొరికిన 46తులాల బంగారు ఆభరణాలు, 20తులాల వెండి, రూ.13వేలు నగదు తీసుకొని బెడ్‌రూంలోని అన్ని వస్తువులపై కారంపొడి చల్లి పారిపోయాడు. తెల్లవారుజామున వేణుగోపాల్ వాష్‌రూంకి వెళ్లిన సమయంలో ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా ఉండడం గమనించి బెడ్‌రూంలోకి వెళ్లి చూశాడు. ఆ తర్వాత అతను వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆర్సీపురం సీఐ శ్రీకర్‌బాబు, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీం వచ్చి వివరాలు సేకరించారు. సీసీ ఫుటేజీని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



కిటికీలో నుంచి మెయిన్‌డోర్ తెరిచిన దుండగుడు



ఆర్సీపురంలో వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం



సింగూరు ప్రాజెక్టు ఎగువ భాగాన సీఎస్‌ఆర్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి మిచెల్ డొనిమికతో కలిసి స్థలాన్ని పరిశీస్తున్న మంత్రి దామోదర

## పర్యాటకంగా సింగూరును అభివృద్ధి చేస్తాం

**వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర**

పుల్కల్,డిసెంబర్ 8 : పర్యాటక కేంద్రంగా సింగూరు అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.ఆదివారం సింగూరు ప్రాజెక్టును ఇండియా సీఎస్‌ఆర్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ అధికారి మిచెల్ డొమినికతో కలిసి మంత్రి సందర్శించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు గురించి వారికి వివరించారు.ప్రాజెక్టు మధ్యలో ఐలాండ్ నిర్మించేందుకు అనువైన స్థలం నాలుగు ఎకరాల వరకు ఉంటుందని, ప్రాజెక్టు పూర్తిగా నిండినా ఆ స్థలం ఎప్పుడూ మునిగి పోవడం జరగలేదన్నారు. అక్కడే ఐలాండ్ నిర్మించి బోటింగ్ ఏర్పాటు చేస్తే సందర్శకులు పెరిగి సింగూరు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని మంత్రి అన్నారు.అనంతరం ప్రాజెక్టు దిగువ భాగాన ఉన్న ఫిష్ పై చేసే వ్యాపారుల వద్దకు వెళ్లి వ్యాపారం గురించి ఆరాతీశారు. అనంతరం పుల్కల్ బాలుర గురుకుల పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంత్రి కాసేపు విద్యార్థులతో మాట్లాడారు. అందిస్తున్న విద్యాబోధన, భోజనం గురించి ఆరాతీసి సమస్యలు తెలుసుకున్నారు.పాఠశాలకు ప్రహరీ, టాయిలెట్లు నెలలో పూర్తి చేయిస్తానని విద్యార్థులకు మంత్రి హామీ ఇచ్చారు. పక్కనే ఉన్న కెనాల్ కాలువకు త్వరలోనే శంకుస్థాపన చేసి సీసీ లైన్ పనులు ప్రారంభిస్తామని, అందుకు అక్కడ ఉన్న అనువైన స్థలాన్ని శుభ్ర పరచాలని అధికారులకు మంత్రి సూచించారు. అనంతరం అందోల్‌లోని పలు విద్యాసంస్థలను మంత్రి పరిశీలించి సౌకర్యాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మహిళా పాలిటెక్నిక్ కళాశాల, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మంత్రి మాట్లాడారు.మంత్రి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంచంద్రారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, గోవర్ధన్, యూత్ అధ్యక్షుడు ఉదయ్, ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయులపై గురుతర బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్‌రావు

**మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్**

నారాయణఖేడ్, డిసెంబర్ 8: ఉపాధ్యాయులపై గురుతర బాధ్యత ఉందని, దేశ భవిష్యత్తు వారి చేతుల్లో ఉందని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. ఆదివారం నారాయణఖేడ్‌లో సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగారెడ్డి జిల్లా 6వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను తప్పక పాటించాలన్నారు. కార్యక్రమానికి హాజరైన జహీరాబాద్ ఎంపీ సురేశ్‌శెట్కార్, స్థానిక ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నదని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందని తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన పలు నిర్ణయాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. పర్యవేక్షణ అధికారులు లేక విద్యారంగ అభివృద్ధికి ఆటంకంగా మారిందన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి , రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి , జిల్లా అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి సాయిలు, జిల్లా ఉపాధ్యక్షుడు కాశీనాథ్, సువర్ణ, కోశాధికారి శ్రీనివాసరావు, నారాయణఖేడ్ డివిజన్ బాధ్యులు పాల్గొన్నారు.